

RNI: APTEL/2010/36742

న్యూస్ వార్

వార్తా పత్రిక

విలేకరులు కావలెను

తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన

యువత యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం

న్యూస్ వార్ దిన పత్రిక

నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో

వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.

94409 91979

నల్లగొండ | epaper.news war.com | శనివారం 23, మే 2026 | సంపుటి :16 సంచిక :56 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00

# భారత్ ఎన్నటికీ తలవంచదు



2 లో..

## సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు

## జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నాం

## ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీ

## బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తాం

## పశువుల అక్రమ రవాణా మార్గాలను గుర్తించాలి


## కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందుకోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ, దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలస దారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు.

న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారంనాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశ ంలో అమిత్‌షా మాట్లాడుతూ, అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు.

### బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే..

## ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం: హరీశ్ రావు



బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

వార్త 2లో

### ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాణాలు

## కోల్పోతున్న రైతులు: కేటీఆర్



తెలంగాణలో ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం సేకరణపై సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గన్నీ బ్యాగులు దొరకడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అబద్ధాలతో సీఎం రేవంత్ పాలనను నెట్టుకొస్తున్నారని అన్నారు.

వార్త 2లో



## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు..

దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?' అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది.

2



## విజయ్ క్యాబినెట్ విస్తరణ.. ప్రభుత్వంలో కొత్తగా మరో ఇద్దరి చేరిక

తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం శుక్రవారంనాడు మరోసారి మంత్రివర్గ విస్తరణ జరిపింది. ప్రభుత్వంలో మరో ఇద్దరికి చోటు కల్పించింది. టీవీకేకు బయట నుంచి మద్దతిస్తామని ఇంతకుమందు ప్రకటించిన విడుదలై చిరుతైగళ్ కట్చి , ఇండియన్ యూని యన్ ముస్లిం లీగ్ ) అధికార కూటమిలో చేరాయి.

2



## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల.. ఏపీలో ఖాళీ కానున్న 4 స్థానాలు

దేశంలో వివిధ రాష్ట్రాల్లోని పలువురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఎన్నికల ప్రకటన విడుదల చేసింది. దేశంలో మొత్తం 10 రాష్ట్రాల్లో 24 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది.

2




## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 10 కేజీల గాంజా స్వాధీనం.. ఒకరి అరెస్ట్

2




## డిప్యూటీ కలెక్టర్ నివాసంలో ఏసీబీ సోదాలు.. కేసు నమోదు

మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా గతంలో పని చేసిన వంశీ మోహన్ నివాసంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆయనకి సంబం ధించిన 8 ఇళ్లపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేసి తనిఖీలు చేపట్టారు.

## ఫ్యూచర్ సిటి కొనసాగుతుంది..ఎవరూ అడ్డుకోలేరు: అద్దంకి

**హైదరాబాద్:**

కల్వకుంట్ల తిక్కల్ రావు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. కెటిఆర్ పనికిమాలిన మాటలు మానుకోవాలని అన్నారు. అద్దంకి కెటిఆర్ కు కౌంటర్ ఇచ్చారు. పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకోం అని సిఎం కావాలని కెటిఆర్ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఫ్యూచర్ సిటి కొనసాగుతుందని.. ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. బండి భగీరథ్ కేసులో ప్రభుత్వం సరిగా స్పందించిందని నిందితుడిని అరెస్ట్ చేశారని తెలియజేశారు. దొంగలను కాపాడాల్సిన అవసరం సిఎం రేవంత్ రెడ్డికి లేదని అద్దంకి దయాకర్ రావు పేర్కొన్నారు.



### సచివాలయం వద్ద

## టిఆర్ఎస్ ధర్నా.. కవిత అరెస్ట్

**హైదరాబాద్:**

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సచివాలయం వద్ద ధర్నా చేశారు. వరి ధాన్యం రోడ్డుపై పోసి నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తోందని.. అన్నదాతను అరిగోసలు పెడుతోందని ఆరోపించారు. తెలంగాణ రైతుల గోస ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి తెలియాలనే సచివాలయం ఎదుట ధర్నా చేపట్టినట్లు కవిత తెలిపారు. రెండున్నర ఏళ్లలో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కవితతోపాటు ఆ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు ఫలక్‌నుమా పీఎస్‌కు తరలించారు.



# రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?' అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది.వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ (శుక్రవారం) ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.

### తరతరాల కోటాతో వ్యవస్థ నుంచి బయటపడలేం!

విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు.ంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది.

### చివరి వ్యక్తికి అందని ఫలాలు

ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది.

# విజయ్ క్యాబినెట్ విస్తరణ.. ప్రభుత్వంలో కొత్తగా మరో ఇద్దరి చేరిక

చెన్నై: న్యూస్‌వార్ ప్రతినిధి

తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం శుక్రవారంనాడు మరోసారి మంత్రివర్గ విస్తరణ జరిపింది. ప్రభుత్వంలో మరో ఇద్దరికి చోటు కల్పించింది. టీవీకేకు బయట నుంచి మద్దతిస్తామని ఇంతకుమందు ప్రకటించిన విడుదలై చిరుతైగళ్ కట్చి , ఇండియన్ యూని యన్ ముస్లిం లీగ్ ) అధికార కూటమిలో చేరాయి. పాపనాశం అసెంబ్లీ నియోజకవర్గం ఐయూఎంఎల్ ఎమ్మెల్యే ఏఎం షాజహాన్, తిండివనం నియోదకవర్గం వీసీకే ఎమ్మెల్యే వన్ని అరసు శుక్రవారంనాడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. టీవీకే ప్రభుత్వం కీలకమైన మంత్రివర్గ విస్తరణ గురువారంనాడు జరిపింది. వీసీకే, ఐయూఎంఎల్‌ను కూడా ప్రభుత్వంలో చేరాలని కోరింది. అయితే పేర్ల ఖరారు విషయంలో ఆ రెండు పార్టీలు జాప్యం చేశాయి. దీంతో 23 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, టీవీకేకు చెందిన 21 మంది ఉన్నారు. దీనికంటే ముందు ముఖ్యమంత్రితో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం ప్రమాణస్వీకారం చేశారు. మొత్తం 35 మందికి క్యాబినెట్‌లో అవకాశం ఉండగా, రెండో ఖాళీలు మిగిలాయి. వీసీకే, ఐయూఎంఎల్ తాజాగా ప్రభుత్వంలో చేరడంలో మంత్రి కొలువుల భర్తీ పూర్తయింది.కాగా, ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వ విశ్వాస తీర్మానికి అనుకూలంగా ఓటు వేసిన అన్నాడీఎంకే రెబల్ వర్గానికి చెందిన 25 మంది ఎమ్మెల్యేలకు టీవీకే ప్రభుత్వంలో చోటు దక్కలేదు. గురువారం మంత్రివర్గ విస్తరణ సందర్భంగా రెబల్ ఎమ్మెల్యేలలోని తొమ్మది మంది షణ్ముగం వర్గానికి దూరంగా ఉండిపోయారు. రాబోయే రోజుల్లో చాలామంది పార్టీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు వెనక్కి తీరిగి వస్తారని అన్నాడీఎంకే గట్టి నమ్మకంతో ఉంది.

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల.. ఏపీలో ఖాళీ కానున్న 4 స్థానాలు

న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

దేశంలో వివిధ రాష్ట్రాల్లోని పలువురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఎన్నికల ప్రకటన విడుదల చేసింది. దేశంలో మొత్తం 10 రాష్ట్రాల్లో 24 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది. జూన్ 1వ తేదీన ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపింది. జూన్ 1 నుంచి జూన్ 8 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొంది.జూన్ 9వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని.. జూన్ 10వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించింది. జూన్ 18వ తేదీన ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామంది. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి.. ఫలితాన్ని ప్రకటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గుజరాత్‌లో 4, కర్ణాటకలో 4, మధ్యప్రదేశ్‌లో 3, రాజస్థాన్‌లో 3, జార్ఖండ్‌లో 2 స్థానాలతో పాటు మణిపూర్, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరంలో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.వాటితో పాటూ ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. జూన్ 21వ తేదీతో వైసీపీ నుంచి ఎంపికైన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వాని, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు టీడీపీ నుంచి ఎంపికైన సానా సతీష్ పదవీ కాలం ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలోని పార్టీలకు 164 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. దాంతో ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు ఆయా పార్టీలు సొంతం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయనే చర్చ నడుస్తోంది.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్న రైతులు: కేటీఆర్

హైదరాబాద్,

తెలంగాణలో ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం సేకరణపై సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గన్నీ బ్యాగులు దొరకడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అబద్ధాలతో సీఎం రేవంత్ పాలనను నెట్టుకొస్తున్నారని అన్నారు. మంచిర్యాల జిల్లాలో నలుగురు రైతులు చనిపోయారని.. కానీ ఒక్కరైతు కూడా చనిపోలేదని మంత్రులు మాట్లాడటం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటివరకు 35శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని మాజీ మంత్రి విమర్శించారు. రైతులే కాదు.. కాంగ్రెస్ కార్యకర్తలూ ధర్నా చేస్తున్నారని తెలిపారు. నిన్న(గురువారం) సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో కూడా రైతులు ధర్నా చేశారని అన్నారు. సంక్షోభాన్ని గుర్తించకుండా సీఎం అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ విషయంలోనూ ప్రణాళిక లేదని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

# భారత్ ఎన్నటికీ తలవంచదు

## సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు

## జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నాం

## ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీ

## బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తాం

## పశువుల అక్రమ రవాణా మార్గాలను గుర్తించాలి

## కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందుకోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరిం చనున్నామనీ, దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలస దారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారంనాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశ ంలో అమిత్‌షా మాట్లాడుతూ, అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు



అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందు కోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్డర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్‌డ్ కెమెరాలతో బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నా లజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు. బీఎస్ఎఫ్ నేరుగా రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, విలేజ్ పట్వారీల సమన్వయంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలని, అక్రమ చొరబాటుదారులను, పశువుల అక్రమ రవాణా మార్గాలను గురించాలని అమిత్‌షా సూచించారు. పశ్చిమబెంగాల్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలను కలుపుకుని కలుపుతూ సెక్యూరిటీ గ్రిడ్ ఏర్పాటు జరుగుతుందని, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోం శాఖ త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. వామపక్ష తీవ్రవాదం నిర్మూలనపై మాట్లాడుతూ, సమస్యను కంట్రోల్ చేయడం కేవలం భద్రతగా చూడరాదని, ఈ బెడదను సమూలంగా పెకిలించాల్సిందేనని అన్నారు. వాపక్ష తీవ్రవాదం ఎలా నిర్మూలించామో అదే రేతిలో చొరబాటుదారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఫ్రంట్‌లైన్ జవాన్లకు సహకరించేందుకు ఉన్నతస్థాయి డెమోగ్రఫీ మిషన్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్టు అమిత్‌షా ప్రకటించారు. దేశభద్రతకు బీఎస్ఎఫ్ అందిస్తున్న సేలను అమిత్‌షా ప్రశంసించారు. 1965లో బీఎస్ఎఫ్‌ను కేవలం 25 బెటాలియన్లతో ప్రారంభించగా ఇప్పుడది 2,70,000 మందితో పటిష్టమైన దళంగా ఏర్పడిందని, ప్రపంచంలోనే అతిపెద్ద సరిహద్దు రక్షణ దళంగా నిలిచిందని అన్నారు. సరిహద్దుల పటిష్టత విషయంలో బీఎస్ఎఫ్ ఎప్పుడూ వెనుకంజ వేయలేదన్నారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా శత్రువును చిత్తుచేస్తూ వచ్చారని, దేశం ఎప్పుడూ తలవంచుకునే పరిస్థితి రాలేదని అన్నారు. విధి నిర్వహణలో అసమాన సేవలందించిన బీఎస్ఎఫ్ సిబ్బందిని హోం మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు.

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం: హరీశ్ రావు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు.ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధి పొందాలని ప్లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 10 కేజీల గాంజా స్వాధీనం.. ఒకరి అరెస్ట్

హైదరాబాద్, , న్యూస్‌వార్ ప్రతినిధి

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో(శంషాబాద్) మరోసారి గాంజా స్మగ్లింగ్ యత్నం బయటపడింది. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో 10 కేజీల గాంజాను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. గాంజా స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. లగేజీ బ్యాగ్ కింది భాగంలో ప్రత్యేకంగా తయారు చేసిన ప్యాకెట్లలో గాంజాను దాచి తరలిం చేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. స్కానింగ్ సమయంలో అనుమానాస్పదంగా కనిపించడంతో లగేజీని తనిఖీ చేయగా గాంజా స్మగ్లింగ్ ఉదంతం బయటపడింది. అధికారులు గాంజాను స్వాధీనం చేసుకుని.. నిందితుడిని ముమ్మరంగా విచారిస్తున్నారు. ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. స్మగ్లింగ్ నెట్‌వర్క్ వెనుక ఉన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.శంషాబాద్ ఎయిర్‌పోర్టు కొన్ని నెలలుగా డ్రగ్ స్మగ్లింగ్‌కు హాట్ స్పాట్‌గా మారింది. బ్యాంకాక్, దుబాయ్ వంటి నగరాల నుంచి గాంజా తరలింపు యత్నాలు తరచుగా జరుగుతున్నాయి. ఏప్రిల్ నెలలో 13.2 కేజీల గాంజా పట్టుబడగా.. ఓ ప్రయాణికుడిని అధికారులు అరెస్ట్ చేశారు. ఈనెలలో(మే నెల) రెండు సందర్భాల్లో 8.7 కేజీల గాంజాను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికులు బాటిళ్లు, స్నాక్స్ టిన్లలో గాంజాను దాచినట్లు అధికారులు తెలిపారు.





# డిప్యూటీ కలెక్టర్ నివాసంలో ఏసీబీ సోదాలు.. కేసు నమోదు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా గతంలో పని చేసిన వంశీ మోహన్ నివాసంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆయనకి సంబంధించిన 8 ఇళ్లపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో వంశీ మోహన్‌కు సంబంధించి.. రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అతడిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అధికారులు నమోదు చేశారు.పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులు కాజేసినట్లు వంశీ మోహన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. శేరిలింగంపల్లితో పాటు పలు ప్రాంతాల్లో వంశీ మోహన్ ఆర్డీవోగా పనిచేశారు. అలాగే అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురంలో 8 ఎకరాల భూమిని ఆయన కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు భూమిని తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి.. దానిని రియల్టర్‌కు కట్టెబట్టినట్లు విమర్శలు వచ్చాయి.ఇక ఓ రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్‌ను వంశీ మోహన్ తీసుకున్నట్లు కూడా ఈ సోదాల్లో ఏసీబీ గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో వంశీ మోహన్‌ను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

# విషాదం.. ఎవరెస్ట్ ఎక్కి కిందకు వస్తుండగా.. ఇద్దరు భారతీయులు మృతి

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ పర్వతంపై విషాదం చోటు చేసుకుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి కిందకు దిగి వస్తుండగా ఇద్దరు భారతీయులు మృతి చెందారు. మృతులను అరుణ్ కుమార్ తివారీ, సందీప్ ఆరేగా నేపాల్ అధికారులు గుర్తించారు. కిందకు దిగుతున్న సమయంలో వాళ్లు తీవ్రంగా అలసిపోయారని.. రక్షించేందుకు గైడ్స్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. బుధవారం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన 274 మంది పర్వతారోహకులలో సుందీప్ ఆరే సహా తులసి రెడ్డి పాల్పునూరి, అజల్ పాల్ సింగ్ అనే



మరో ఇద్దరు భారతీయులు ఉన్నట్లు నేపాల్ ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ వెల్లడించింది. ఒకే రోజులో అత్యధిక సంఖ్యలో ఎవరెస్టును అధిరోహఇంచిన బృందంగా వీరు ఒక కొత్త రికార్డు నెలకొల్పారు. అయితే పర్వతం దిగుతున్న సమయంలో సందీప్ ఆరే మృతి చెందారు. గురువారం సాయంత్రం మరో బృందం పర్వత శిఖరాన్ని చేరుకొని తిరిగి వస్తుండగా అరుణ్ కుమార్ తివారీ కూడా మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

సంపాదకీయం...

# యుద్ధాల విధ్వంసాలకు ముగింపు లేదా?

యుద్ధాలకు అంతం ఎప్పుడు అన్న ప్రశ్న ప్రపంచంలో ఇప్పుడు ఎదురవుతోంది. గత రెండు మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్, మరోపక్క ఇజ్రాయెల్, పాలస్తీనా హమాస్, ఇంకో వైపు అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధాలతోనే విధ్వంసాలను కోరితెచ్చుకుంటున్నాయి. రష్యాతో పోల్చుకుంటే అన్ని విధాలా చిన్న దేశమైన ఉక్రెయిన్ అమెరికా అండదండలతో రష్యాపై దాడులు కొనసాగిస్తూనే ఉంది. గత శనివారం రాత్రి కొన్ని వందల డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ జరిపిన దాడిలో ఒడిశాకు చెందిన ఒక యువకుడుతోపాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇంకా కొంతమంది గాయపడ్డారు. యుద్ధం పరిసమాప్తం అవుతుందని పదిరోజుల క్రితం రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించినప్పటికీ ఉక్రెయిన్ డ్రోన్లతో భీకర దాడులతో సాహసించడం వెనుక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రేరేపణ ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇంతవరకు ఉక్రెయిన్ జరిపిన దాడుల్లో ఇదే చాలా పెద్దదని తెలుస్తోంది. అనేక భవనాలు, మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. యుద్ధలన్నీ ముగించాలన్న ఉద్దేశం పుతిన్‌కు అసలు లేదని, ఆయన ప్రకటనలకు, చర్యలకు ఎక్కడా పొంతన కుదరడం లేదని అందుకే పుతిన్‌కు బుద్ధి చెప్పడానికే డ్రోన్లతో రష్యాపై దాడులు చేశామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ నిర్భయంగా ప్రకటించారు. పుతిన్ రాజీకి చొరవ తీసుకోకుంటే ఆయనకు, ఆయన దేశానికి వినాశనం తప్పదని జెలెన్‌స్కీ హెచ్చరించారంటే ఉక్రెయిన్ రష్యా యుద్ధం ఇప్పట్లో ముగిసే అవకాశం ఉందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రష్యాతో యూరప్‌కు సంబంధాలు లేవు. అయినా రష్యాఉక్రెయిన్ యుద్ధ ప్రభావం యూరప్ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్రంగా ఉంటోంది. అయినా సరే యూరప్ దేశాలు ఈ యుద్ధాన్ని నివారించడానికి తగిన ప్రయత్నాలు ప్రారంభించడం లేదు.

ఇక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ తమతో వెంటనే రాజీ కుదుర్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని పదే పదే హెచ్చరిస్తున్నారు. ే సుస్థిర అభివృద్ధి ప్రస్తుతం తెర వెనుక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే రెండు మూడు రోజుల్లోనే లేదంటే వచ్చే వారం ఆరంభంలో ఇరాన్‌పై దాడులు ప్రారంభిస్తామని ట్రంప్ హెచ్చరిస్తున్నా ఇరాన్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అమెరికా ఇజ్రాయెల్ మళ్ళీ దాడులు చేస్తే సరికొత్త వ్యూహాలతో దాడులను ఎదుర్కొంటామని ఇరాన్ హెచ్చరించడం గమనార్హం. తమ సాయుధ దళాల గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా ఉన్నాయని ఇరాన్ ప్రకటించింది. దీన్ని బట్టి అటు ఇటు యుద్ధానికి కాలుదువ్వుతున్న పరిణామాలే కనిపిస్తున్నాయి తప్ప శాంతి సంధి అన్న ఆలోచన ఎవరికో ఉండడం లేదు. సరికదా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును హతమారిస్తే 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 500 కోట్లు) బహుమతిగా ఇస్తామని "ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య" పేరున ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్ ఇబ్రహీం అజీజ్ ప్రకటించారు. ఇంకా మరికొన్ని దేశాల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. యుఎఇ లోని బరకాహ్ అణు విద్యుత్ కేంద్రంపై డ్రోన్ల దాడి జరిగింది. ఇరాక్ నుంచే ఆ డ్రోన్లు దూసుకొచ్చాయని యుఎఇ రక్షణ శాఖ వెల్లడించింది. తైవాన్ తమకే చెందుతుందని ఈ విషయంలో అమెరికా జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. బలవంతమైన దేశం తన పొరుగున ఉన్న బలహీనమైన దేశాన్ని కబళించి కొల్లగొట్టడమే నేటి యుగ ధర్మంలా కనిపిస్తోంది. ఇన్ని జరుగుతున్నా ఐక్యరాజ్య సమితి వంటి అత్యంత ప్రతిష్ఠాత్మిక వ్యవస్థలు ఎందుకు ఈ యుద్ధాలను ఆపలేకపోతున్నాయన్న ప్రశ్న ప్రపంచ దేశాలను వేధిస్తోంది. హంసాకాండ, మానవ హక్కుల ఉల్లంఘిన అనేక దేశాల్లో విచ్చలవిడిగా సాగుతోంది. దీనిని ఏ అంతర్జాతీయ వ్యవస్థ నివారించలేక మొక్కుబడి ప్రకటనలతో కాలం గడుపుతోంది. గాజాలోని పాలస్తీయన్లపై 2025 కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ఆ ఒప్పందాన్ని కాలరాసి ఇజ్రాయెల్ మారణకాండకు పాల్పడుతోంది. అలాగే ఉక్రెయిన్‌లోని కీలకమైన పౌర, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తూ రష్యా సంవత్సరాలుగా దాడులు సాగిస్తోంది. ఇవన్నీ ఐక్యరాజ్య సమితి చార్టర్, జెనీవా ఒప్పందం వంటి అంతర్జాతీయ సంస్థల ఒప్పందాలను తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుంది. ఏ దేశాధినేతలూ వీటిని ఖండించడం లేదు. ప్రపంచ ప్రజల ఆరోగ్యం, అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేసేందుకు ఐక్యరాజ్యసమితి ఎన్నో అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసుకుంది. అవన్నీ ఏ పని చేయలేక నిర్వీర్యమవుతున్నాయి. ప్రతీకార సుంకాల పేరున అమెరికా తనకు వ్యతిరేకంగా ఉన్న దేశాలపై ఆర్థిక సంకెళ్లు వేస్తోంది. ఇరాన్, అఫ్గాన్ దేశాల్లో మహిళల హక్కులను ఉక్కుపాదంతో తొక్కుతున్నారు. అమెరికా, రష్యా, ఇజ్రాయెల్, వరకు అగ్రరాజ్యాలు అంతర్జాతీయ క్రిమినల్



కోర్టును కూడా బలహీన పర్చాయి. అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన దోషిగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించి విచారించేందుకు సిద్ధపడినా నెతన్యాహూను ఏమీ చేయలేకపోతోంది. ఐసిసి న్యాయమూర్తులపై రష్యా న్యాయస్థానాలు అరెస్టు వారెంట్లు విధించాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన నివేదికలో వెల్లడించింది. వివిధ దేశాల్లోని కార్మికులు, ఆదివాసీ ప్రజలు, ఇతర బలహీన వర్గాల వారు తమ హక్కులను పరిరక్షించుకోడానికి ప్రధాన కారణం ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ చట్టాలే. వివిధ దేశాల్లో పేదరిక నిర్మూలనకు, ఆరోగ్య పరిరక్షణకు ఈ సంస్థలే విశేషమైన కృషి చేశాయి.

# 'స్త్రీ శక్తి' థీమ్‌తో 2026 మహానాడు నిర్వహణ


### ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చర్చ

### పెట్టుబడులు, యువతకు అవకాశాలపైనా ప్రస్తావన

### టిడిపి పోలిట్ బ్యూరోలో పలు అంశాలపై చర్చ

**అమరావతి**

2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని పొలిట్‌బ్యూరో టిడిపి నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మహిళా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, మహిళల భాగస్వామ్యంతో అమలు చేసిన కార్యక్రమాలను మహానాడు వేదికగా ప్రజలకు తెలియజేయాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూచించారు. మహిళల భాగస్వామ్యంతోనే ప్రతి సంక్షేమ పథకాన్ని రూపొందించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై మహానాడులో సమగ్ర చర్చ జరగాలని దిశానిర్దేశర చేశారు.తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం గురువారం మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం, పొలిట్‌బ్యూరో నియామకం తర్వాత తొలిసారి ఈ భేటీ జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్‌గా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ భేటీలో మహానాడు నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహానాడు వేదికగా చేపట్టాల్సిన తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై విస్తృతంగా చర్చించారు. ఈసారి మహానాడులో మొత్తం 20 కీలక తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 10



తీర్మానాలు, తెలంగాణకు సంబంధించిన 4 తీర్మానాలు, అండమాన్‌కు సంబంధించిన ఒక తీర్మానం, ఉమ్మడి అంశాలపై 4 తీర్మానాలు, రాజకీయ తీర్మానాలు ఉండనున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పెట్టుబడులు, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేలా మహానాడును నిర్వహించాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి రెండు రోజుల ముందే ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అగ్రనాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు అందరినీ మహానాడులో భాగస్వాములను చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహానాడు ప్రారంభానికి ముందు రాష్ట్రంలోని అన్ని క్లస్టర్లలో దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు విగ్రహాలకు నివాళులు అర్పించి కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే ఎన్టీఆర్ సిద్ధాంతాలు, తెలుగుదేశం పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా ప్రత్యేక ప్రజెంటేషన్లు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన రాజకీయ, సామాజిక మార్పులను మహానాడు వేదికగా ప్రదర్శించాలని సీఎం మార్గనిర్దేశర చేశారు. పొలిట్ బ్యూరో సమావేశంలో వైసీపీపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తున్న 'గొడ్డలి పార్టీ కుట్రలను' మహానాడు వేదికగా ప్రజల ముందుంచాలని నిర్ణయించారు. అలాగే 'నా దేశం-నా బాధ్యత' పేరుతో పొదుపు చర్యలు, సామాజిక బాధ్యతలపై ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నారు.

## పాక్‌లోనే పహల్గాం దాడికి పథకం

### ఎన్‌ఐఎ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు

**న్యూఢిల్లీ,**

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఎ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఉగ్రదాడికి సంబంధించి.. వ్యూహ రచన, పథకం అమలు అంతా పాకిస్థాన్ కేంద్రంగానే సాగిందనేందుకు బలమైన సాక్ష్యాలతో ఎన్‌ఐఎ బహిర్గతం చేసింది. ఈ ఘటన జరిగిన వెంటనే ఈ దాడికి తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) ప్రకటించింది. ఈ దాడికి వ్యూహ రచన నుంచి టీఆర్‌ఎఫ్ చేసిన ఈ ప్రకటన వరకు అంతా పాకిస్థాన్‌లోనే జరిగిందని వివరించింది. అందుకు సంబంధించిన ఫోన్ కాల్స్, ఐపీ అడ్రాస్ తదితర అంశాలను ఈ ఛార్జిషీట్‌లో ఎన్‌ఐఎ పొందుపరిచింది. ఈ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఫైజల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్ఘానీల ఐపీ అడ్రస్, ఫోన్ నెంబర్లతోపాటు ఇతర ఆధారాలన్నీ పాక్‌లోని ఈ దాడి వెనుక సూత్రధారులతో వీరికి సంబంధాలు ఉన్నట్లు ఎన్‌ఐఎ గుర్తించింది. సైనిక బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ మహాదేవ్'లో ఈ ముగ్గురు ఉగ్రదాలను కాల్చి చంపాయి. వారి నుంచి మొబైళ్లు స్వాధీనం చేసుకున్నాయి. అవి పాక్‌లోనే కొనుగోలు చేసినట్లు ఎన్‌ఐఎ దర్యాప్తులో తేలింది. ఈ మొబైల్ ఫోన్లు.. లాహోర్, కరాచీలో కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. 2025, ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలోకి ఉగ్రవాదులు ప్రవేశించి.. పర్యాటకులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 25 మంది మరణించారు. ఈ కాల్పుల ఘటనకు తామే బాధ్యులమని లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) ప్రకటించింది. అది కూడా సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. దీనిపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో టీఆర్‌ఎఫ్ వెనక్కి తగ్గింది. ఈ టీఆర్‌ఎఫ్ ప్రకటనపై కూడా ఎన్‌ఐఎ విచారణ జరిపింది. ఇవి కూడా పాకిస్థాన్ నుంచే వచ్చాయని వివరించింది. ఉగ్రదాడికి టీఆర్‌ఎఫ్‌కు చెందిన ఉగ్రవాది సైఫుల్లా అలియాస్ సాదిజ్ జాట్ కీలక సూత్రధారి అని ఎన్‌ఐఎ స్పష్టం చేసింది. అతడి ఆదేశాల మేరకే తీవ్రవాదులు బైసరన్ లోయలో రెక్కి నిర్వహించారని తన ఛార్జిషీట్‌లో ఎన్‌ఐఎ వెల్లడించింది. ఈ దాడి జరిగిన రోజు.. ఆ తీవ్రవాదులతో సైఫుల్లా నిరంతరం చర్చలు జరిపినట్లు గుర్తించామని ఎన్‌ఐఎ తెలిపింది. అంతేకాకుండా ఈ దాడి తర్వాత ఎలా తప్పించుకోవాలనే అంశాన్ని కూడా ఉగ్రవాదులకి సైఫుల్లా వివరించినట్లు ఎన్‌ఐఎ తెలిపింది. అంశాలన్నీ ఎన్‌ఐఎ తన ఛార్జిషీట్‌లో పొందుపరిచింది. మరోవైపు ఈ పహల్గాం ఉగ్రదాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని పాక్ స్పష్టం చేసింది. భారత్ తమపై కావాలని ఆరోపణలు చేస్తుందంటూ ప్రపంచానికి పాక్ చాటే ప్రయత్నం చేసింది. కానీ అంత మందిని పొట్టనపెట్టుకున్న ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయం ఉందని ఎన్‌ఐఎ తన దర్యాప్తులో నిగ్గు తేల్చింది.

## చంద్రగిరి మండలంలో అర్ధరాత్రి ఏనుగుల బీభత్సం

**తిరుపతి,**

తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం రంగంపేట దగ్గర నాగపట్ల ప్రాంతం, రాగిమానుగుంటలో ఏనుగుల గుంపు బుధవారం రాత్రి బీభత్సం సృష్టించాయి. అర్ధరాత్రి మామిడి తోటలోకి వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేసాయి. ఏనుగుల గుంపు గ్రామ పరిసరాల్లోకి చొరబడి, అర్ధరాత్రి ఏనుగులు పంట పొలాల్లో భీకర శబ్దాలతో గీంకరిస్తుండగా, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రైతుల మామిడి తోట, ఫెన్సింగ్ కూసాలు, నీటి పైపులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసాయి. మూడు రోజులుగా నాగపట్లలోనే గజరాజులు చేరినట్లు రైతులు అనుమానిస్తున్నారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేశారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల అటవీప్రాంతంలోకి తరిమేందుకు, బాణా సంచా పేలుస్తూ, డప్పు శబ్దాలతో ప్రయత్నించారు. పంట నష్టం తప్ప ఎటువంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్తులు రాత్రిపూట బయటకు రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు తెలియజేసారు.

## భద్రతా మండలిలో మరోమారు పాక్ దుర్నీతి

### గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి

### నరమేథం చేసే పాక్‌కు మాట్లాడే హక్కులేదని విమర్శలు

**న్యూఢిల్లీ,**

అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భం గా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్ పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు. 'చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు. తన సొంత ప్రజల పైనే బాంబులు వేస్తూ, జాతి నిర్మూలనకు పాల్పడే దేశం ఇలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడటంలో పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదన్నారు.

## ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష షెడ్యూల్

### నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్,**

ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష (సీపీగెట్)కు ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 7 విశ్వవిద్యాలయాలతోపాటు జేఎన్‌టీయూహెచ్, కొత్తగూడెం ఎర్త్‌సైన్సెస్ వర్సిటీల్లో పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించనున్న సీపీగెట్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, వర్సిటీల వైస్ ఛాన్సలర్లు(వీసీలు), కన్వీనర్ తదితరులు విడుదల చేశారు. తొలిసారి సీపీగెట్‌ను తమ వర్సిటీ నిర్వహిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈసారి ఇంటర్ విద్యార్హతతో ప్రవేశాలు పొందే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీ సీపీగెట్ ద్వారా ఉండదని, వాటిని దోస్త్‌లో చేర్చినట్లు తెలిపారు. కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ మొత్తం 45 స్జబెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆలస్య రుసుం లేకుండా జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.2 వేల ఆలస్య రుసుంతో 18 వరకు అవకాశం ఉంటుంది. జులై తొలివారంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు మొదటివారంలో తరగతుల ప్రారంభం. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టుల భర్తీకి మార్గదర్శకాలతో 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వం జీవో జారీచేసినా.. ఇంకా ఏ వర్సిటీ ఎన్ని ఖాళీలను భర్తీ చేసుకోవాలన్నది స్పష్టత ఇవ్వలేదని ప్రతాప్‌రెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తగినంత మంది ఆచార్యులు లేకపోవడం వల్ల పరిశోధన కొంత తగ్గిందన్నారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ నియామకాల్లో కొంత ఆలస్యమైన విషయం వాస్తవమేనని, ప్రభుత్వంతో సంప్రదిస్తున్నామని తెలిపారు.

## చక్కెర ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,**

పంచదార ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎగుమతులను తక్షణం నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దేశీయంగా చక్కెర ధరలు పెరగకుండా, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలోని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. ముడి, తెల్ల, శుద్ధి చేసిన చక్కెరలకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టంచేసింది.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# చండూరులో టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదు



చండూర్ మే 22 ( న్యూస్ వార్ )

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) ఎప్పుడైనా ముందుంటుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న అన్నారు. శుక్రవారం చండూరులో టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జర్నలిస్టుల సమస్యల పట్ల స్పందించి, ఐక్యం చేసిన మొట్టమొదటి సంఘం ఐజేయు అని అన్నారు. ప్రస్తుతం జర్నలిస్టులకు అందుతున్న కొద్ది అవకాశాలైన అది ఐజేయు చేసిన పోరాటాల ఫలితమే అని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. టీయూడబ్ల్యూజే మునుగోడు నియోజకవర్గ ప్రింట్ మీడియా అధ్యక్షులు రాపోలు ప్రభాకర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎరుకల వంశీకృష్ణ ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కేసాని శ్రీధర్ రెడ్డి, నల్ల స్వామి, సంగేపు మల్లికార్జున్, సాగర్ గౌడ్, కర్నాటి వెంకటేశం, జక్కల నాగరాజు, మాధగోని శ్రీనివాసులు, రవీంద్ర చారి, శంకర్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలను సవరించాలి

నిజామాబాద్ మే 21 (న్యూస్ వార్ )

ఈరోజు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న ప్రకటించిన కార్మికుల కనీస వేతనాలను సవరించాలని అన్నారు. గత 12 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల వేతనాల పెంపు జరగలేదని గత ప్రభుత్వం తెలంగాణ కార్మికులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనాల బోర్డును




ఏర్పాటు చేయడాన్ని ఏఐటీయూసీ తరపున గతంలోనే స్వాగతించామని తెలియజేశారు. కనీస వేతనాల బోర్డు తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ధరలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల కార్మికుల ఆర్థిక స్థితిగతుల భత్యం తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర కార్మిక సంఘాలు 26వేల వేతనాన్ని డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నియమించిన కనీస వేతనాల బోర్డు 22 వేలకు నిర్ధారిస్తూ గత ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరిగిందని, ప్రభుత్వం నియమించిన కనీస వేతనాల బోర్డు ఈనివేదికను పట్టించుకోకుండా కార్మికుల ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకోకుండా కార్మికుల వేతనాలను 16 వేలకు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను గమనంలో పెట్టుకొని శ్రమ చేసే కార్మికుల వేతనాలను అన్ స్కిల్డ్ కార్మికులకు 22 వేలకు పెంచాలని, సెమీస్కిల్డ్ వారికి 26 వేలకు పెంచాలని, స్కిల్ కార్మికులకు 30 వేల పైచిలుకు వేతనాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని వారి వేతనాలకు డిఏను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ప్రెస్ మీట్ లో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టి చక్రపాణి జిల్లా కార్యదర్శులు పి హనుమండ్లు, బి .అనిల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన సంకల్పమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన 49వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ) సమావేశంలో ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొని బ్యాంకర్లకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో బ్యాంకులు కేవలం ఆర్థిక సంస్థలుగానే మిగిలిపోకుండా, ప్రభుత్వానికి వ్యూహాత్మక భాగస్వాములుగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. దేశ సగటు వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంటే, దానిని అధిగమిస్తూ తెలంగాణ రాష్ట్రం 10.7 శాతం అద్భుతమైన ఆర్థిక వృద్ధితో దేశంలోనే ముందువరసలో దూసుకుపోతోందని ప్రభుత్వం వెల్లడించింది. అలాగే, రాష్ట్ర తలసరి ఆదాయం ఏకంగా రూ. 4.18 లక్షలకు చేరుకుని, ఈ విభాగంలోనూ తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిచిందని ప్రకటించింది. మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించే వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచినట్లు ప్రభుత్వం ఈ సభాముఖంగా తెలియజేసింది. హైదరాబాద్ నగరంలోని మురికివాడల్లో నివసించే యువ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు యుద్ధ ప్రాతిపదికన రుణాలు అందించేలా ఒక ప్రత్యేక కార్యాచరణను సైతం రూపొందిస్తున్నట్లు స్పష్టం చేసింది. మరోవైపు, విద్యార్థులకు అందించే విద్యా రుణాలను భవిష్యత్తు తరాలపై పెట్టే పెట్టుబడిగా భావించాలని, ఈ విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు వచ్చి యువతకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేసింది. వ్యవసాయ రంగానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యానికి మించి 101.88 శాతం మేర రుణాలు అందించిన బ్యాంకర్లను ప్రభుత్వం ఈ సమావేశంలో ప్రత్యేకంగా అభినందించింది. వ్యవసాయ రంగంలో చూపించిన ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో పాటు నూతన సౌరశక్తి ప్రాజెక్టులకు సైతం మరింత ప్రాధాన్యతనిచ్చి ఆర్థిక చేయూతనివ్వాలని కోరింది.

# జూన్ 2 నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, నూతన పింఛన్లు

## ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం

## ములుగు 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' సభలో మంత్రి దనసరి అనసూయ సీతక్క

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క.. జాతీయ గీతం, 'జయ జయహే తెలంగాణ' గీతాలాపనతో సభను ప్రారంభించారు. జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, నూతన పింఛన్ల మంజూరు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆమె కీలక ప్రకటన చేశారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను అధికారులు తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు.విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అందులో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు 'బ్రేక్‌ఫాస్ట్ పథకం' అమలు చేయబోతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. రోజు విడిచి రోజు రాగి జావ, వేడి పాలు అందిస్తామని, ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తామని తెలిపారు. దివ్యాంగ ఇంటర్ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించేలా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'ను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. ఆరు గ్యారెంటీలైన రైతు భరోసా, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న వడ్లకు బోనస్, ఇందిరా మహిళా శక్తి,



కొత్త రేషన్ కార్డుల వంటి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న తీరును ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ములుగు నియోజకవర్గానికే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, జిల్లాలో కొత్తగా 38 వేలకు పైగా పింఛన్లను జూన్ 2న అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. స్థానిక నిరుద్యోగ యువత కోసం 80 నుంచి 100 బహుళజాతి, ప్రైవేట్ కంపెనీలతో త్వరలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రామచంద్రాపూర్ గ్రామ శివారులోని 10 వేల ఎకరాల భూములకు రీ-సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించామని, ఆలయ అభివృద్ధికి 22 ఎకరాల భూమిని సేకరించి పరిహారం చెల్లించామన్నారు. జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, సరిపడా లారీలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ పారదర్శకంగా చేరవేయడమే లక్ష్యమన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు గుర్తించాలని, ప్రజా దర్బార్‌లో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి సీతక్క చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాలకు భారీగా రుణ చెక్కులను పంపిణీ చేశారు. స్త్రీ నిధి ద్వారా 112 సంఘాలకు రూ. 2.25 కోట్లు, బ్యాంకు లింకేజీ ద్వారా 175 సంఘాలకు రూ. 16.15 కోట్లు, మున్సిపాలిటీ మెప్మా ద్వారా 25 సంఘాలకు రూ. 2.02 కోట్ల చెక్కులను అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన 140 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, పెగడపెల్లి, కాసిందేవిపేట, రాయినిగూడెం గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, ఆర్డీవో వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేర్చడమే లక్ష్యం

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పరిగి ఎమ్మెల్యే టి. రామ్ మోహన్ రెడ్డి సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎమ్మెల్యే టి. రామ్ మోహన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గత ప్రభుత్వాల కంటే ప్రజా ప్రభుత్వం భారీ స్థాయిలో రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. రేషన్ కార్డు ఉన్న వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. రైతులకు వ్యవసాయ యంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని, జిల్లాలో ఆత్మ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిగి మండలానికి రైతు విజ్ఞాన కేంద్రం మంజూరైందని, దీని కోసం మిట్టకోడూరులో 40 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. భూ కేటాయింపులు పూర్తయితే 84 ఎకరాల్లో 400 కేవీ విద్యుత్ కేంద్రం, అలాగే 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభమవుతాయన్నారు.జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు 10 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 2.8 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. 35 వేల కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఆరు లైన్ల రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు సైతం భూసేకరణను వేగవంతం చేయాలని కోరారు. పూడూర్ ప్రాంతంలో నేవీ ప్రాజెక్టు పనులు శరవేగంగా



సాగుతున్నాయని, దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వివరించారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయని, కర్ణాటక సరిహద్దు వరకు, అలాగే మన్నెగూడ నుంచి వికారాబాద్ మీదుగా తాండూరు వరకు మరో నాలుగు లైన్ల రహదారి అనుసంధానానికి అనుమతులు లభించాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో బీటీ రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. అధికారులు అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రభుత్వ పథకాలను ప్రజలకు విజయవంతంగా అందించవచ్చని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.ఇప్పటివరకు మూడు వ్యవసాయ సీజన్లలో 2,82,509 మంది రైతులకు 1,114.25 కోట్ల రూపాయల రైతు భరోసా లబ్ధి చేకూరిందన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు 2,893 కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో 144.65 కోట్ల రూపాయల రైతు బీమా నగదు జమయ్యిందని వివరించారు. జిల్లాలో 12,628 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 7,444 ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో 158.98 కోట్ల రూపాయలు జమ చేశామని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,19,735 మందికి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందుతోందని, 10.43 కోట్ల రూపాయల వ్యయంతో 2,97,142 సిలిండర్లు సరఫరా చేశామన్నారు. 1,05,049 మందికి చేయూత ఆసరా పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. 2025-26 వానాకాలం సీజన్‌లో సన్న రకం వరి సాగును ప్రోత్సహించేందుకు 2 వేల మంది రైతులకు 7.04 కోట్ల రూపాయల సబ్సిడీని అందించినట్లు చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 2023 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు 13,724 మంది లబ్ధిదారులకు 137.38 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇందిరా మహిళా శక్తి కింద 2025-26లో 8,797 మహిళా సంఘాలకు 1,513.52 కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు, గత రెండేళ్లలో 11,002 మందికి 40.09 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, కె. వెంకటాచారి, జెడ్పీ సీఈఓ సుధీర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, కుందుమల్ల రజిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా



తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు తన రాజీనామా లేఖను పంపారు. ఈ సందర్భంగా తన రాజీనామాపై ఆయన స్పందిస్తూ.. తనకు తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్‌పర్సన్ గా సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.విద్యా కమిషన్ చైర్మన్గా విద్యపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించానని, ప్రభుత్వం ఇచ్చిన పనిని పూర్తి చేసిన క్రమంలో.. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి గత కొంత కాలంగా విద్యా, వైద్య రంగాలపై రాష్ట్రంలో అధ్యయనం చేస్తున్న సంగతి తెలిసిందే. భూపాలపల్లి జిల్లా కలెక్టర్గా విధులు నిర్వర్తించి పేదలు, ఆదివాసీల మన్ననలు పొందారు.

# పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారికి అమిత్ షా శుభాకాంక్షలు

పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేత సువేందు అధికారికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కొత్త బాధ్యతలు చేపడుతున్నందుకు అభినందనలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, సువేందు అధికారి నాయకత్వంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుపరిపాలన కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తుందని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నూతన ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,